

అనుమతి లేని లే అవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేయొద్దు

ప్రభుత్వ అనుమతి లేని లే అవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేయవద్దని పీకేఎం-ఉడా వైస్ చైర్మన్ బాబర్ తెలిపారు. - 8లో



హడలెత్తిస్తున్న ప్రమాదాలు

జాతీయ రహదారులు మృత్యు మార్గాలుగా మారుతున్నాయి. నిత్యం ప్రమాదాలతో ప్రజల ప్రాణాలను హరిస్తున్నాయి. ఆయా కుటుంబాల్లో విషాదాన్ని నింపుతున్నాయి. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.180	రూ.220
రెండోరకం	రూ.110	రూ.178

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 526 మెట్రిక్ టన్నులు





కోల్‌కతాలో వైద్యురాలిపై అత్యాచారం, హత్య సంఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో వైద్యులు, వైద్య సిబ్బంది భద్రత ..సాకర్యాలపై 'సాక్షి' క్యాంపెయిన్.

ప్రత్యేక చట్టాలను తేవాలి



కోల్‌కతా వైద్యురాలిపై జరిగిన సంఘటన బాధాకరం. ఇలాంటి ఘటనలు దేశంలో మరెక్కడా జరగకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలను తీసుకురావాలి. ఎంతో బాధ్యాయుతంగా రోగులకు వైద్య సేవలు అందించే వైద్యులకు రక్షణ లేకపోవడం దురదృష్టకరం. –డాక్టర్ రాధ మాధవి, పీహెచ్‌సీ గాలివీడు.

పూర్తిస్థాయి నిఘా ఏర్పాటు చేయాలి



ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో పూర్తి స్థాయి నిఘా ఉండేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. చాలా ప్రాంతాల్లో సీసీ కెమెరాలు లేవు. దీంతో రాత్రివేళల్లో విధులకు హాజరు కావాలన్నా.. హాస్టళ్లకు వెళ్లాలన్నా.. మహిళా వైద్యులు భయాందోళనకు గురవుతున్నారు. లైట్లు కూడా ఏర్పాటు చేయాలి. – రఫీకుల్లా, కొత్తపల్లి ప్రాథమిక వైద్యాధికారి, చిన్నమండెం

విచారణ వేగవంతం చేయాలి



కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం సంఘటన చాలా విచారకరం. ప్రభుత్వాలు విచారణ వేగవంతం చేయాలి. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన శిక్షలు అవసరం. ఆస్పత్రులలో భద్రతాపరమైన చర్యలు చేపట్టాలి. వైద్యసేవలు అందించేవారి రక్షణకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టాలి. – డాక్టర్ నిమ్రుచి, వైద్యురాలు, పెనగలూరుమండలం

సీసీ కెమెరాల ఏర్పాటుతో పర్యవేక్షణ ఉండాలి



విధి నిర్వహణలో ఉండే మహిళా డాక్టర్లు, వైద్య సిబ్బందికి పూర్తి స్థాయిలో భద్రత కల్పించేందుకు ఆస్పత్రిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షించాలి. ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. –డాక్టర్ ఎ.వెంకటరామయ్య, మెడికల్ ఆఫీసర్, సీహెచ్‌సీ, తంబళ్లపల్లె

న్యూస్‌రీల్

వీరభద్రస్వామి ఆలయ పాలక మండలికి దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి టౌన్: రాయచోటిలోని శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయ పాలక మండలి కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆలయ ఈఓ డీవీ రమణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నోటీసు వెలువడిన 20 రోజులలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దేవదాయ శాఖ వారి నియమ నిబంధనల మేరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి చేసిన దరఖాస్తులు కర్నూలు కృష్ణానగర్ వీధిలోని కార్యాలయంలో నేరుగా సమర్పించాలన్నారు.

పొలం బడిని సందర్శించిన జేడీఏ



పొలంబడిలో రైతులకు సూచనలు, సలహాలు ఇస్తున్న జేడీఏ చంద్రానాయక్

సుండుపల్లె: మండల పరిధిలోని మడితాడు-2 రైతు సేవా కేంద్రంలో పొలంబడి కార్యక్రమాన్ని జేడీఏ చంద్రనాయక్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేరుశనగ పంటలో విత్తన మోతాదు, విత్తన శుద్ధి, మొలకశాతం , అంతర పంటల ఆవశ్యకతను వివరించారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది సకాలంలో ఈ-పంట నమోదును పూర్తి చేయాలని ఆదేశించారు. మండల వ్యవసాయాధికారి మహబూబ్ బాషా, టెక్నికల్ ఏఓ రమేష్ రాజు, గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు రైతులు పాల్గొన్నారు.

హార్సిలీహిల్స్‌పై పారిశుధ్య పనులు



హార్సిలీహిల్స్‌పై పారిశుధ్య పనులు చేస్తున్న కార్మికులు

సాక్షి ఎఫెక్ట్..

బి.కొత్తకోట: పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై నెలకొన్న సమస్యలపై మంగళవారం సాక్షిలో ప్రచురితమైన కొండంత నిర్లక్ష్యం కథనంపై అధికారులు వేగంగా స్పందించారు. ఉదయమే కొండపై పారిశుధ్య పనులు చేపట్టారు. పరిశుభ్రత చర్యలు తీసుకున్నారు. కాగా మంగళవారం హార్సిలీహిల్స్‌ను సందర్శించిన కలెక్టర్ శ్రీధర్ కొండపై విద్యుత్ హైమాస్ లైట్లు వెలగకపోవడం, పర్యాటకులకు తాగునీటి ఇబ్బందులపై స్పందించారు. ఈ సమస్యలపై టౌన్‌షిప్ కమిటీ చైర్మన్‌గా చర్యలు తీసుకొవాలని మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్‌కు సూచించారు.



ఈ రైతు పేరు తిరువీధుల సుబ్బరాయుడు. ఇతని ఊరు ఈడిగపల్లె మద్దిరేవుల గ్రామం, అన్నమయ్య జిల్లా. ఈ రైతు ఖరీఫ్‌లో వేరుశనగ సాగు చేసుకోవడానికి వేరుశనగ విత్తన కాయలు తెచ్చుకున్నాడు. తీరా వర్షాలు పడకపోవడంతో అదును దాటిపోవడంతో పంట సాగు చేసుకోలేక విత్తనాలు అమ్ముకున్నాడు. ఈ మధ్యకాలంలో పదునుపాటి వర్షం పడకపోవడంతో చేసేదేం లేక వేరుశనగ విత్తనాలను మార్కెట్లో తక్కువ ధరకు అమ్ముకున్నాడు.



నా పేరు ఆవుల ప్రసాద్. మాది చిన్నమండెం మండలం దిన్నెమీదల్లి గ్రామం. నేను వేరుశనగ రెండు ఎకరాల్లో సాగు చేశాను. వర్షం రాకపోవడంతో వంట కాస్త ఎండిపోయింది. దీంతో చేసేదేమీ లేక పంటను దున్నేశాను. ఈ సీజన్‌లో పంట దెబ్బతినడంతో కనీసం వంకాయ పంట సాగు చేద్దామని 1.5 ఎకరాల్లో సిద్ధం చేసుకున్నాను. కానీ ఇంతవరకు పదును వర్షమే కురవలేదు. దీంతో పంట సాగుచేసుకోలేకపోయాను.



ఖరీఫ్ కాటు!

- ఆరుతడి వైపే రైతన్నల అడుగులు
- ఈ సీజన్‌లో పంటల సాగుకు దాటిన గడువు
- వర్షాభావంతో వేసిన పంటలు సైతం ఎండుతున్న వైనం
- రానున్న కాలంలో ఆరుతడి పంటల సాగు మేలంటున్న వ్యవసాయాధికారులు
- వర్షాలు లేకపోవడంతో కొనుగోలు చేసిన విత్తనాలను అమ్ముకుంటున్న రైతులు



రాయచోటి సమీపంలో వాడిపోతున్న వేరుశనగ

జిల్లాలో ప్రధాన పంటల సాగుకు సంబంధించిన వివరాలు (హెక్టార్లలో)

జిల్లాలో సాధారణ సాగు లక్ష్యం:	65,386
ఇప్పటివరకు పంటల సాగు:	12,165
వేరుశనగ పంట సాగు:	6010
మొక్కజొన్న:	593
వరి:	316
కందులు:	144

సాక్షి రాయచోటి: ఖరీఫ్‌లో కోటి ఆశలతో...కొత్తకొత్త ఆకాంక్షలతో అడుగు పెట్టిన అన్నదాతపై ప్రకృతి ప్రకోపించింది. ఒకవైపు పంట విత్తుదామంటే వర్షం లేక ఒకసారి దెబ్బ....అరకొరగా పడిన వర్షానికి అదును దాటుతుందని వేసిన విత్తనం మొలక దశ దాటినా ఇప్పటికీ వరుణుడి కరుణ లేదు. మొలక ఆశపై కూడా వరుణుడు రాకపోగా ప్రచండ భానుడి దెబ్బకు పంటలు విలవిల్లాడుతున్నాయి. అది కూడా జిల్లాలో అంతంత మాత్రంగానే సాగు కాగా, వర్షపు జాడ లేని రైతులు ఏకంగా ఖరీఫ్‌లో కొనుగోలు చేసిన పంట విత్తనాలను తిరిగి అమ్ముకుంటున్నారు. ఖరీఫ్ ఆశలపై వరుణుడు కాటు వేయడంతో చేసేదేమీ లేక రబీలో సాగుపై ఆశలతో సిద్ధమవుతున్నారు. రానున్న కాలంలో ఆరుతడి పంటలు సాగు చేయడమే మేలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

వాడు ముఖం పడుతున్న పంటలు

అన్నమయ్య జిల్లాలో ఖరీఫ్ సీజన్ పంటలపై కాటు వేసింది. చెట్లు ఉంటే క్షేమం...లేకుంటే క్షామం అన్న విషయం మరోసారి రూఢీ అవుతోంది. ఎక్కడ చూసినా ప్రజలు ప్రకృతి వినాశనం వైపు అడుగులు వేస్తుంటే పర్యావరణంలో మార్పులు, పరిస్థితులు వర్షాకాలంలోనూ ఎండలు విపరీతంగా కాసే పరిస్థితులు కళ్లెదుటే కనిపిస్తున్న దృశ్యాలు సాక్ష్యంగా నిలుస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలకు వర్షం లేకపోగా ఎండ ప్రభావం కూడా దెబ్బతీస్తోంది. జిల్లా వ్యాప్తంగా సాగు చేసిన వేరుశనగతోపాటు అలసంద, మినుము, మొక్కజొన్న తదితర పంటలు వాడుముఖం పట్టి ఎండిపోతున్నాయి. కొంతమంది రైతులు ఏకంగా పంటలను దున్నేశారు. మరికొంతమంది భారీ వర్షం వస్తే అంతో ఇంతో దిగుబడులు వస్తాయన్న ఆశతో అలాగే ఉంచుకున్నారు. అందులోనూ ఖరీఫ్ సీజన్‌లో సాధారణ లక్ష్యం 65,386 హెక్టార్లు కాగా, ఇప్పటివరకు 12,165 హెక్టార్లలో మాత్రమే పంటలు సాగయ్యాయి.

ఆశలపై నీళ్లు

ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన జూన్ నుంచి ఇప్పటివరకు భారీ వర్షాలంటూ ఏమీ లేవు. కనీసం సాగు చేసిన పంటలకు కూడా నీళ్లు లేకపోవడంతో ఎండు దశకు చేరుకున్నాయి. ఇప్పుడు వర్షాలు కురిసినా పంటల దిగుబడులు వచ్చే పరిస్థితులు లేవు. ఖరీఫ్ కరువు కాటుతో పూర్తిగా దెబ్బతింది. అన్నదాతకు ఈ సీజన్ కూడా పెట్టుబడి ఖర్చులు మీదికి వచ్చి నష్టాలపాలు కావడమే తప్ప ఇతర ప్రయోజనం లేకుండా పోయింది.

వర్షాలు పడితేనే పంటల సాగు

జిల్లాలో రైతులు ఆరుతడి పంటలవైపు అడుగులు వేయాలని వ్యవసాయశాఖ సూచిస్తోంది. ఖరీఫ్ సీజన్ అక్టోబరు వరకు ఉన్నా ప్రస్తుతం భారీ వర్షాలు పడితే అలసంద, మినుము లాంటి పంటలు వేసుకోవచ్చని అధికారులు సూచిస్తున్నారు. అక్టోబరులో అయితే రబీ సీజన్ ప్రారంభమవుతుంది. వేరుశనగతోపాటు వరి, మొక్కజొన్న, నువ్వులు సాగుకు అవకాశం ఉంటుంది.

వాటర్‌గ్రిడ్‌లోకి హార్సిలీహిల్స్: కలెక్టర్

బి కొత్తకోట: బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై ఒబెరాయ్ హోటల్స్ రానుండటం, పర్యాటకుల సంఖ్య పెరిగిన దృష్ట్యా నీటి సమస్య పరిష్కారం కోసం హార్సిలీహిల్స్‌ను వాటర్‌గ్రిడ్ పరిధిలోకి తీసుకొస్తున్నట్టు కలెక్టర్ శ్రీధర్ చామకూరి వెల్లడించారు. మంగళవారం ఒబెరాయ్ ప్రతినిధులతో కలిసి కొండపై వారికి కేటాయించిన భూమిని పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ వారంలో పదివేల మంది పర్యాటకులు కొండను దర్శిస్తున్నారని చెప్పారు. దీంతో తాగునీటి సమస్య లేకుండా రూ.2,400 కోట్లతో చేపట్టిన వాటర్‌గ్రిడ్‌లో భాగం చేసి నీటిని సరఫరా చేస్తామన్నారు. హార్సిలీహిల్స్‌పై అడ్వంచర్ టూరిజం, ట్రెకింగ్, క్లాంపింగ్ అన్నింటికి అనుకూలంగా ఉందన్నారు. ఒబెరాయ్ సంస్థకు ఇక్కడ అన్ని రకాల వసతులు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం చూపుతున్న చొరవ, సహకారంపై సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. గుర్రంకొండ కోట, వెలిగల్లు రిజర్వాయర్, రాజంపేట తాళ్లపాక అన్నమాచార్యులను కలుపుతూ, తిరుపతి- బెంగళూరు- కడపతో సర్క్యూట్‌ను ఏర్పాటు చేసుకొని పర్యాటకం అభివృద్ధి చేయడానికి అవకాశం ఉందన్నారు. ఒబెరాయ్ గ్రూపు ద్వారా త్వరగా ఇక్కడ పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోమని సీఎం ఆదేశించారన్నారు. ఒబెరాయ్ సంస్థ దశలవారీగా రూ.200 కోట్ల రూపాయలు పెట్టుబడులు పెట్టేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారని, హెలిపాడ్ సర్వీస్ పెట్టేందుకు అవకాశాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు.



హార్సిలీహిల్స్‌పై ఒబెరాయ్ ప్రతినిధులతో భూమి పరిశీలనలో కలెక్టర్

రిజిస్ట్రేషన్లలో అక్రమాలు

ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్లలో అక్రమాలు వెలుగుచూసినట్టు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 1.35 లక్షల ఎకరాల ఫ్రీహోల్డ్ భూములకు సంబంధించి లక్ష ఎకరాల పరిశీలన పూర్తయిందన్నారు. 1,500 ఎకరాల ఫ్రీహోల్డ్ భూములకు రిజిస్ట్రేషన్లు జరిగితే అందులో 150 రిజిస్ట్రేషన్లు పరిశీలించగా 50 రిజిస్ట్రేషన్లలో అక్రమాలను గుర్తించామని చెప్పారు. భూమి హక్కు కలిగిన వ్యక్తులు కాకుండా ఇతరులు రిజిస్ట్రేషన్లు చేశారని, దీనిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, సర్వే ఏడీ / యరాం, టూరిజం ఆర్డీ ప్రసాద్, డీటీఓ నాగభూషణం, టూరిజం అధికారులు నేదురుమల్లి సాల్వీన్‌రెడ్డి, మురళీ, తహసీల్దార్ శ్రీధర్‌రావు, ఆర్ఐ బాలాజీ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


రెండు గ్రామాల్లో ఫ్రీహోల్డ్ భూముల పరిశీలన

రామాపురం: మండల పరిధిలోని నీలకంఠ్రావుపేట, గువ్వలచెరువు గ్రామాల్లో మంగళవారం ఫ్రీ హోల్డ్ భూములను జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ పరిశీలించారు. ఫ్రీ హోల్డ్ భూముల వెరిఫికేషన్ పక్కాగా నిర్వహించాలని మండల తహసీల్దార్ రామాంజనేయులుకు సూచించారు.

ఆకస్మిక తనిఖీ

లక్కిరెడ్డిపల్లి: రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన నిబంధనల మేరకు పక్కాగా రీ-వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ మండల రెవెన్యూ అధికారులను ఆదేశించారు. జిల్లాలో క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఫ్రీహోల్డ్ భూముల రీ-వెరిఫికేషన్ ప్రక్రియ అంశంపై మంగళవారం లక్కిరెడ్డిపల్లి మండలంలో కలెక్టర్ ఆకస్మికంగా పర్యటించి తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

శ్రద్ధాంజలి



Sri DSN Reddy Garu

కీ॥శే॥ శ్రీ డి. సూర్యనారాయణ రెడ్డి గారు

రిటైర్డ్ - డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, తిరుపతి

జననం 10-07-1947

మరణం 27-08-2024

అందరినీ చిరునవ్వుతో పలకరిస్తూ... అందరి మంచి కోరే మనసున్న మనిషి, ఎల్లప్పుడూ మాకు ప్రేమానురాగాలు, ఆప్యాయతలు పంచుతూ ... నిరంతరం మా కుటుంబ అభ్యున్నతికి కృషి చేసిన మా ఇంటి దైవం శ్రీ డి. సూర్యనారాయణ రెడ్డి గారు 27-08-2024వ తేది మంగళవారం స్వర్గస్తులైనారు. తదుపరి వీరి దహనక్రియలు తేది 28-08-2024 బుధవారం మ॥ 2 గం॥లకు పద్మావతి పురంలోని మా స్వగృహం నుండి అంతిమయాత్ర ప్రారంభమై తిరుపతి, కరకంబాడి రోడ్డు వద్దనున్న గోవింద దామం నందు జరుగునని తెలియజేయడమైనది.

శోకతప్త హృదయాలతో... భార్య : డి. సౌభాగ్యవతి

కుమారులు		కోడళ్ళు
డా॥ డి. సునీల్ కుమార్	-	డా॥ లావణ్య
డా॥ డి. సుజిత్ కుమార్	-	డా॥ కీర్తిణ్మయి
డి. సుశాంత్ కుమార్	-	శివ స్వప్న

మరియు కుటుంబ సభ్యులు

7-109/1, పద్మావతిపురం, తిరుచానూరు రోడ్డు, తిరుపతి. ఫోన్ : +91 7702627384

కడప ఎమ్మెల్యేపై కేసు నమోదు చేయాలి

- చెత్తను వేసిన వారిపై కూడా చట్టపరంగా చర్యలు తీసుకోవాలి
- కడప నగర మేయర్ కె. సురేష్ బాబు ఆగ్రహం

కడప అర్బన్: కడప నగరంలోని చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్‌కు కేవలం 300 మీటర్ల దూరం ఉన్న తన ఇంటి ముందు టీడీపీ కార్యకర్తలతో కొందరు ప్రజలను రెచ్చగొట్టి చెత్తతో బైఠాయించడమే కాకుండా చట్ట విరుద్ధంగా తన ఇంట్లోకి చెత్త పారవేయడం ఎంత వరకు సమంజసమని కడప నగర మేయర్ కె. సురేష్‌బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఉదయం మేయర్ కె.సురేష్‌బాబు కడపలోని వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వైఎస్ అవినాష్ రెడ్డి పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొనేందుకు వచ్చారు. వేడుకలను ముగించుకుని తిరుపతి వైపు ప్రయాణం సాగించారు. సరిగ్గా రాజంపేట సమీపంలోకి చేరుకోగానే, అప్పటికే టీడీపీ కార్యకర్తలను, కొందరు ప్రజలను రెచ్చగొట్టిన కడప ఎమ్మెల్యే ఆర్. మాధవి, వారిచేత తన ఇంటి ముందు ఆందోళన చేయించడమేగాక, ఏకంగా తన ఇంటిలోపలికే చెత్తను విసిరివేయించడం సరికాదన్నారు. కడప నగరంలోని కార్పొరేషన్ పరిధిలో చెత్త పన్ను వసూలు చేయరాదని రాష్ట్ర ప్రభుత్వం మౌఖికంగా ఆదేశాలు వచ్చాయేగానీ జీ.ఓ ఇంతవరకు విడుదల చేయలేదని మేయర్ కె. సురేష్‌బాబు తెలియజేశారు. చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆయన మీడియాతో మాట్లాడారు. కడప ఎమ్మెల్యే ఆర్. మాధవి చెత్తసేకరణపై రాద్ధాంతం చేసి తమ పార్టీ కార్యకర్తలను, కొంతమంది ప్రజలను తన ఇంటిపై చెత్తను వేయించే సాహసం చేయడం ఎంత వరకు సమంజసమన్నారు. తాను 30 ఏళ్ల రాజకీయ అనుభవం కలిగి వున్నానన్నారు. అలాంటి రాజకీయ చరిత్ర వున్న తన ఇంటిపై తాను లేని సమయంలో టిడిపి కార్యకర్తలను రెచ్చగొట్టి ఇలాంటి పనికిమాలిన పనులు చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. కడప ఎమ్మెల్యే బుద్ధిలేక చేసిన పనికి తాము పోలీసులకు ఫిర్యాదు చేసి కేసు నమోదు చేసి చట్టపరంగా చర్యలను తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.



చిన్నచౌక్ పోలీస్ స్టేషన్ వద్దకు పార్టీ నాయకులు, కార్పొరేటర్లతో వెళుతున్న మేయర్ సురేష్‌బాబు

మైనింగ్ మాఫియా హల్‌చల్..!

- వేములలో విచ్చలవిడిగా రెచ్చిపోతున్న తెలుగుతమ్ముళ్లు
- అక్రమ మైనింగ్ చేస్తూ 3 ట్రాన్స్‌ఫార్మర్లను ఢీ కొట్టిన జేసీబీ
- ఫిర్యాదు చేస్తే సహించమని ట్రాన్స్‌కో అధికారులకు బెదిరింపులు



సాక్షి టాస్క్‌ఫోర్స్: మైనింగ్ మాఫియా రెచ్చిపోతుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పచ్చనేతలు విచ్చలవిడిగా అక్రమ ఆదాయం కోసం అర్రులు చాస్తున్నారు. వేముల మండలంలో మైనింగ్ లీజుదారులను బెదిరిస్తూ ఆ పక్కనే అక్రమ మైనింగ్‌కు పథక రచన చేస్తున్నారు. భూమి లోపల లీజుదారుల మైనింగ్‌లోకి ప్రవేశించి విచ్చలవిడిగా బెరైటీస్ దోచేస్తున్నారు. టిఫెన్ కంపెనీకి చెందిన బెరైటీస్ దోపిడిలో భాగంగా ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారు. వైఎస్ఆర్ జిల్లా వేముల మండల వ్యాప్తంగా టీడీపీ నేతలు విచ్చలవిడిగా అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్నారు. లీజుదారుల మైనింగ్‌లోకి దౌర్జన్యంగా చొరబడి ముడి ఖనిజాన్ని దోచేస్తున్నారు. అడ్డు చెప్పిన వారిపై దూషణలకు దిగుతూ దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. ఈక్రమంలో అక్రమ మైనింగ్ చేస్తూ జేసీబీ ఢీ కొని విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. ఆ స్తంభాలపై ఉన్న 3ట్రాన్స్‌ఫార్మర్లు పడిపోయాయి. ఇదేంటి ఇలా అడ్డదిడ్డంగా చేస్తున్నారని ప్రశ్నించిన పాపానికి ట్రాన్స్‌కో అధికారులపై రెచ్చిపోయారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే తర్వాత ఉంటుందంటూ బెదిరింపులకు దిగుతున్నారు. ఈమొత్తం వ్యవహారం వేముల మండల వ్యాప్తంగా ప్రజానీకం విస్తృత చర్చ నడుస్తోంది. టీడీపీ నేతల దౌర్జన్యాలకు అడ్డుకట్ట పడే అవకాశమే లేదా? అంటూ పలువురు ఆవేదన చెందుతున్నారు. కాగా ఈవిషయమై ట్రాన్స్‌కో ఏఈ వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాకపోవడం గమనార్హం.

మహిళలు తలెత్తుకుతిరిగేలా భద్రత ఉండాలి



రాత్రి వేళల్లోనూ మహిళలు తలెత్తుకొని తిరిగేలా భద్రత వుండాలి. కోల్‌కతా ఘటన బాధాకరం. ఇలాంటి సంఘటనలతో మహిళా డాక్టర్లలో ధైర్యం సన్నగిల్లుతోంది. నైట్ డ్యూటీలు చేసే డాక్టర్లకు రక్షణ కరువై విధులకు హాజరు కాలేరు. వారికి అన్ని విధాలా రక్షణతోపాటు సౌకర్యాలు కల్పించాలి. లేకుంటే పగటి వేళల్లో విధులు నిర్వహించేలా చూడాలి.

– గీతాంజలి, స్టాఫ్ నర్స్, సంబేపల్లె పీహెచ్‌సి

ఔట్ పోస్టు ఉండాలి



ప్రభుత్వ ఆస్పత్రులలో ఔట్ పోస్టింగ్ ఏర్పాటుచేస్తే దాడులు తగ్గుతాయి. కొన్ని సందర్భాల్లో పేషెంట్ల సంఖ్య ఎక్కువగా ఉన్నపుడు అందరూ ఆతృతగా వస్తారు. కాస్త ఆలస్యమైనా అనాలోచితంగా మాట్లాడతారు. రాత్రి వేళ డ్యూటీ సమయంలో పేషెంట్ తరఫున వాళ్లు ఆవేశంగా మాట్లాడటం, దాడులకు పాల్పడటం జరుగుతోంది. ఔట్ పోస్టింగ్ ఏర్పాటు చేస్తే దాడులు తగ్గుతాయి.

– మహేంద్ర, ల్యాబ్ టెక్నీషియన్, రాయచోటి



నిందితులకు శిక్ష విధించాలి



కోల్‌కతాలో పీజీ విద్యార్థినిపై జరిగిన అమానుషం పునరావృతం కాకుండా కఠినమైన చట్టాలు తీసుకురావడం అత్యంత అవసరం. అబలలపై లైంగిక దాడులకు పాల్పడాలంటే వణుకు పుట్టేలా నిందితులకు శిక్ష విధించాలి. తల్లిదండ్రులకు కడుపు కోత మిగిల్చే అధికారం ఎవరికీ లేదు. వారికి రక్షణ కల్పించే దిశగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి.

– రత్నమ్మ, హెడ్ నర్స్, సంబేపల్లె మండలం

కఠిన చట్టాలు తేవాలి



కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై జరిగిన ఘటనల నేపథ్యంలో కఠినమైన చట్టాలు తీసుకురావాలి. మహిళలపై లైంగిక దాడులంటే భయం పుట్టేలా నిందితులను శిక్షించినప్పుడే మరొకరు దాడులకు పాల్పడరు. అపుడే మహిళలపై దాడులను అరికట్టేకుందుకు వీలవుతుంది. ఆ దిశగా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి. ఆసుపత్రిలలో భద్రతను మరింత కట్టుదిట్టం చేయాలి.

– డాక్టర్ శ్రీవిద్య, చింతపర్తి పీహెచ్‌సీ, వాల్మీకిపురం మండలం

క్లుప్తంగా

త్రుటిలో తప్పిన ప్రమాదం



బోల్తా కొట్టిన కారు

సంబేపల్లె : మండలంలోని చిత్తూరు–కర్నూలు జాతీయ రహదారిపై మొటుకువాండ్లపల్లె సమీపంలో మంగళవారం కారు అదుపుతప్పి బోల్తా పడింది. రాజంపేట పట్టణానికి చెందిన కిరణ్ రెడ్డి, కిషోర్ రెడ్డి, బాబూరావు, సాకేత్ తమ సొంత పనుల నిమిత్తం కారులో పీలేరుకు వెళ్తుండగా మొటుకువాండ్లపల్లె సమీపంలో టైర్ పంక్చరై అదుపు తప్పి బోల్తా కొట్టింది. ప్రమాదంలో గాయపడిన వారిని రాయచోటి ఆసుపత్రికి తరలించారు. ఎలాంటి ప్రాణనష్టం కలగలేదని స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

భార్యా, బిడ్డలు కనిపించలేదని ఫిర్యాదు

వీరబల్లి : తన భార్య, ఇద్దరు బిడ్డలు రెండు రోజుల నుంచి కనిపించలేదంటూ మండలంలోని తాటిగుంటపల్లి పంచాయతీ షికారుపాలేనికి చెందిన క్రిష్టియన్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ మోహన్ నాయక్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

శాంతి భద్రతలను నిర్వర్తించాలి

రాయచోటి : జిల్లాలో శాంతి భద్రతల విషయంలో సీఐలు బాధ్యతగా పనిచేయాలని జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆదేశించారు. సాధారణ బదిలీలలో భాగంగా జిల్లాలోని పలు స్టేషన్లలో సీఐలు బాధ్యతలు చేపట్టారు. అనంతరం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీని మర్యాద పూర్వకంగా కలిశారు. డివిజన్ల పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలు, నిర్వహించాల్సిన విధులు, బాధ్యతలపై ఎస్పీ వారికి దిశా నిర్దేశం చేశారు.

నాటు సారా స్వాధీనం



పోలీసుల అదుపులో నాటుసారా, నిందితులు

సుండుపల్లె : నాటుసారా తయారు చేసి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. బుక్కే నాగార్జున నాయక్, బుక్కే ఉదయ్ కుమార్ నాయక్ మంగళవారం బూడిదేటిపల్లి వద్ద నాటు సారా విక్రయిస్తుండగా పట్టుకుని 23 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ రమణ, బిడి.నాయక్, రాజు, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో మహిళ మృతి

పెద్దముడియం : మండలంలోని జె.కొట్టాలపల్లెలో నివాసముంటున్న నర్సాపురం లక్ష్మీ ప్రసన్న(26)విద్యుత్తు షాక్‌తో మృతిచెందినట్లు ఎస్‌ఐ సుబ్బారావు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. జె.కొట్టాలపల్లెకి చెందిన మల్లి అనే వ్యక్తితో లక్ష్మి ప్రసన్నకు ఎనిమిదేళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇంటి ఎదుట రేకులతో వరండా ఏర్పాటుచేసుకోగా.. అక్కడ అమర్చిన ఇనుప కడ్డీకి విద్యుత్తు ప్రసారం జరిగింది. ఇది తెలియక లక్ష్మి ప్రసన్న కడ్డీ పట్టుకోవడంతో షాక్‌కు గురై మృతి చెందినట్లు తెలిపారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

హడలెత్తిస్తున్న ప్రమాదాలు

- భైపాస్ రోడ్లలో కనిపించని స్పీడ్ బ్రేకర్లు, సూచిక బోర్డులు
- పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు
- ఈ ఏడాది జూలై వరకు 311 రోడ్డు ప్రమాదాలు
- 152 మంది మృతి, గాయపడిన వారు 328 మంది

జాతీయ రహదారులు మృత్యు మార్గాలుగా మారుతున్నాయి. నిత్యం ప్రమాదాలతో ప్రజల ప్రాణాలను హరిస్తున్నాయి. పేరుకు హైవేలైనా.. మలుపుల వద్ద వాహనాలు వేగంగా దూసుకు రావడం, నియంత్రణ కోల్పోవడం వంటి ఘటనలు ప్రయాణికులను యమపురికి పంపిస్తున్నాయి. జాతీయ రహదారిపై కొన్ని చోట్ల మాత్రమే సూచికలు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. చాలాచోట్ల అవి కనిపించక ప్రమాదాలు జరిగి అనేక కుటుంబాలను వీధిపాలు చేస్తున్నాయి.



కడప నగర శివార్లలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కారులో ఇరుక్కున్న మృతదేహాలు

జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదాలు

సంవత్సరం	ప్రమాదాలు	మృతులు వారు	గాయపడిన
2020	825	307	970
2021	861	368	949
2022	801	403	837
2023	631	372	730
2024 జూలై వరకు	311	152	328

కడప అర్బన్ : ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో రోడ్డు ప్రయాణం నరకమైపోయింది. మనిషి హూనమై పోతున్నాడు. వాహనాలు ధ్వంసమైపోతున్నాయి. అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. బైక్ మొదలు కారు వరకూ ఏ వాహనం మీద వెళ్లినా ఇబ్బందులు తప్పడం లేదు. వైఎస్ఆర్ జిల్లా సరిహద్దు ప్రాంతాలైన దువ్వూరు పరిధిలో, గువ్వల చెరువుఘాట్‌లో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదాలలో ఏకంగా ఎనిమిది మంది విలువైన ప్రాణాలు ఒక్కసారిగా గాల్లో కలిసిపోయాయి. వాహనదారులు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని ప్రయాణిస్తున్నారు. తరచూ రహదారి నెత్తురోడుతోంది. మరమ్మతులు చేయాలని ప్రజలు అర్థిస్తున్నా.. పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదు. పెరిగిన రవాణా అవసరాలకు తగ్గట్టుగా లేని రోడ్లపై నిత్యం వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి.

గువ్వల చెరువు ఘాట్‌లో పెద్ద ప్రమాదం

గువ్వల చెరువు ఘాట్‌లో 2023 జనవరి, 13న రామాపురం మండలంలోని చర్చి వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో మొత్తం 11 మంది చనిపోగా వారిలో చక్రాయపేట మండలానికి చెందిన వారే 10 మంది ఉన్నారు. ఆ తర్వాత సోమవారం చిత్తూరు నుంచి ఉత్తరప్రదేశ్‌కు అమర్ రాజా బ్యాటరీస్ లోడ్‌తో వెళుతున్న కంటైనర్ లారీ, కడప నుంచి గువ్వలచెరువు వైపు వెళుతున్న ఎథియోస్ కార్‌పైకి దూసుకెళ్లింది. ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న వడ్డెపల్లెకు చెందిన వల్లెపు చిన్నవెంకటమ్మ, గుజ్జుగారి నాగయ్య, నాగలక్ష్మిదేవి మహబూబ్ షరీఫ్ అక్కడే మృతి చెందారు. లారీ డ్రైవర్ మితిమీరిన వేగంతో నడపడంతోనే ఈ ప్రమాదం చోటుచేసుకుంది.

కడప సమీపంలోనూ ప్రమాదాలు

దువ్వూరు మండలం చింతకుంట వద్ద కారు అదుపుతప్పి బోల్తా పడిన సంఘటనలో కర్నూలుకు చెందిన కియాన్ సింగ్ (9నెలలు), భగత్ సింగ్(34), నాగలక్ష్మి (70) మృతి చెందారు. జూన్ 17న కడప నగర శివారులో గురుకుల పాఠశాల సమీపంలోకి వచ్చేసరికి తిరుపతికి వెళ్తున్న ఆర్టీసీ బస్సు వేగంగా వచ్చి కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో రామయ్య, సాయిగురురోహిత్ అక్కడికక్కడే దుర్మరణం చెందారు. భార్యా భర్తలు రాజమోహన్, అతని భార్య లక్ష్మిదేవిలు ఇద్దరు తీవ్రగాయాలపాలయ్యారు.

ప్రమాదంగా 40వ జాతీయ రహహదారి

40వ జాతీయ రహదారి ప్రమాదంగా మారింది. జూలై 6న అన్నమయ్య జిల్లా రామాపురం మండలం చిట్లూరు పంచాయతీ దళితవాడ సమీపంలో ముందు వెళుతున్న ట్యాంకర్‌ను కారు ఢీకొని కడప వాసులు హోంగార్డు పూజారి అంజనేయులు నాయక్, అఫ్రోజ్‌ఖాన్, మారాబత్తుల జితేంద్ర కుమార్, షేక్ హలీమ్ మృతిచెందారు. నిర్లక్ష్యం, మితిమీరిన వేగంతో ఈ దారిలోనే పలు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి.

65 బ్లాక్ స్పాట్లు

జిల్లా వ్యాప్తంగా జాతీయ రహదారుల నుంచి వెళ్లే దారులు, ఆర్అండ్‌బీ పరిధిలోని రోడ్లలో మొత్తం 65 చోట్ల బ్లాక్ స్పాట్స్‌ను అధికారులు గుర్తించారు. ఎన్‌హెచ్–40లో 5, ఎన్‌హెచ్–40 లింక్ రోడ్ల పరిధిల్లో 12 చొప్పున మొత్తం 17 బ్లాక్ స్పాట్స్ గుర్తించారు. ఎన్‌హెచ్–44ం పరిధిలో ఐదు బ్లాక్ స్పాట్స్, ఎన్‌హెచ్–716 పరిధిలో 19, ఎన్‌హెచ్–67 పరిధిలో 09, లింక్ రోడ్డు పరిధిల్లో 12 చొప్పున మొత్తం 21 బ్లాక్ స్పాట్స్ వున్నాయి. ఈ బ్లాక్ స్పాట్స్‌ను పోలీసు, ఆర్ అండ్ బి, రోడ్డు రవాణా శాఖ అధికారులు తమతమ అధ్యయనంలో గుర్తించారు.

రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు కృషి



రహదారుల వెంబడి రోడ్డు ప్రమాదాలు జరిగిన ప్రాంతాల్లో పర్యటించి బ్లాక్ స్పాట్ గుర్తించడం భవిష్యత్తులో జరగకుండా చూస్తున్నాం. రోడ్డు నియమ నిబంధనలు ఉల్లంఘిస్తే వాహనదారులపై కేసులు నమోదు చేయడంతోపాటు జరిమానా విధిస్తాం. వాహనాల వేగ నియంత్రణను అరికట్టేందుకు స్పీడ్ లేజర్ గన్‌తో తనిఖీలు చేపడుతున్నాం.

– ఈ.మీరాప్రసాద్, డీటీసీ, వైఎస్ఆర్ జిల్లా

భారీ వాహనాల వేగ నియంత్రణపై దృష్టి



కర్నూలు– చిత్తూరు జాతీయ రహదారిపై భారీ వాహనాలు మలుపు తిరిగే సమయంలో వేగ నియంత్రణ కోల్పోయి గువ్వలచెరువు ఘాట్‌లో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రోడ్డు వెడల్పు వున్నప్పటికీ వాహనాలు వేగంగా దూసుకురావడం.. నియంత్రణ కోల్పోవడం జరుగుతోంది. ఆర్అండ్‌బీ, రవాణా శాఖ అధికారులతో అధ్యయనం చేసి తగిన ఏర్పాట్లు చేస్తున్నాం.

– వి.హర్షవర్ధన్‌రాజు, వైఎస్ఆర్ జిల్లా ఎస్పీ

ఉపాధ్యాయులకు యాప్ విధులు వద్దు

రాయచోటి అర్బన్ : పాఠశాలల మరుగుదొడ్ల ఫొటోలు తీసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే బాధ్యతల నుంచి ఉపాధ్యాయులను తప్పించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హరిప్రసాద్, జాబీర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం వారు డీఈఓ శివప్రకాష్‌రెడ్డికి వినతిపత్రం అందచేశారు. అనంతరం మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బోధనేతర పనులు రద్దుచేసి బోధనకు మాత్రమే పరిమితం చేయాలని కోరారు. ప్రభుత్వం మరుగుదొడ్ల ఫొటోల బాధ్యత నుంచి ఉపాధ్యాయులను తొలగిస్తూ ఉత్వర్వులిచ్చిందే గానీ, అమలు చేయలేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సురేందరరెడ్డి, హఫీజుల్లా, రాజబాబు, షానవాజ్, తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల సమస్యలపై స్పందించాలి

రాయచోటి అర్బన్ : రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలలో సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వసతి గృహాలలో సమస్యలపై ఈ నెల 28న జరిగే మంత్రివర్గ సమావేశంలో చర్చించాలని కోరారు. మెస్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచాలని, కేజీబీవీ, గురుకుల, మోడల్ పాఠశాలలో సీట్ల సంఖ్య పెంచాలని ఆయన కోరారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర సిబ్బంది ఖాళీలు భర్తీ చేయాలంటూ కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు విశ్వనాథనాయక్, మాధవ్, కార్తీక్, ప్రశాంత్, బాలసుబ్రహ్మణ్యం, వినయ్, వాసు పాల్గొన్నారు.

గుక్కెడు నీరివ్వండి మహాప్రభో

– కలెక్టరేట్ ఎదుట శెట్టిపల్లి గ్రామస్థుల నిరసన



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న దిగువ హరిజనవాడ వాసులు

రాయచోటి అర్బన్ : తాగేందుకు గుక్కెడు నీరు అందించండి అంటూ సంబేపల్లె మండలం శెట్టిపల్లె దిగువహరిజనవాడ వాసులు కలెక్టర్‌ను మంగళవారం వేడుకున్నారు. కలెక్టరేట్ ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ఖాళీ బిందెలు పట్టుకుని నిరసన ప్రదర్శించారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు విశ్వనాథనాయక్, సిద్దిగాళ్ల శ్రీనివాసులు మాట్లాడుతూ దళిత వాడలో నీటి సమస్యపై మూడు వారాల కిందట ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తెలిపామన్నారు. సమస్య పరిష్కారానికి అధికారులు చొరవ చూపలేదన్నారు. నీటి కోసం కాలనీ వాసులు నానా అవస్థలు పడుతున్నారన్నారు.

బాల్య వివాహం నిలిపివేత

రాయచోటి టౌన్ : పట్టణంలోని గాలివీడు రోడ్డులోని సరస్వతి వీధిలో బాల్య వివాహాన్ని ఎస్‌ఐ నరసింహారెడ్డి నిలిపివేశారు. సరస్వతి వీధికి చెందిన ముగ్గు జమ్మయ్య, లక్ష్మిదేవిల కుమార్తెను కడప జిల్లా కేంద్రంలోని ఆంజనేయులు, మాతమ్మల కుమారుడు బ్రహ్మయ్యకు ఇచ్చి వివాహం జరిపేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ విషయం పోలీసులకు తెలియడంతో రాయచోటి ఐసీడీఎస్ అధికారులతో కలిసి వారి ఇంటి వద్దకు వెళ్లారు. ఇరువురినీ పిలిచి 18 ఏళ్లు నిండక ముందే వివాహం నిర్వహించడం చట్ట రీత్యా నేరమని తెలిపారు. అనంతరం ఇరువురినీ తహసీల్దారు ఎదుట బైండోవర్ చేశారు. ఆ బాలికను ఐసీడీఎస్ ద్వారా వన్‌స్టాప్ సెంటర్‌కు అప్పగించారు.

మండల మీట్‌ను అడ్డుకున్న తెలుగు తమ్ముళ్లు



ఎంపీడీఓ కార్యాలయం ఎదుట బైఠాయించిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు

- ఎంపీడీఓ కార్యాలయం ఎదుట అడ్డుగా కూర్చొని నిరసన
- శాంతి భద్రతల దృష్ట్యా వాయిదా వేసిన అధికారులు

ములకలచెరువు : మండలానికి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉద్దేశ పూర్వకంగా మండల్ మీట్‌ను అడ్డుకున్నారు. మంగళవారం ములకలచెరువు మండల సమావేశం ఏర్పాటు చేశారు. వైఎస్సార్‌సీపీకి చెందిన 12 మంది ఎంపీటీసీలు, కో ఆప్షన్ సభ్యులు ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకున్నారు. అప్పటికే మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు కార్యాలయం ఎదుట అడ్డుగా బైఠాయించి నిరసనకు దిగారు. కార్యాలయానికి తాళం వేసి అధికారులను లోపలికి వెళ్లనివ్వకుండా అడ్డుకున్నారు. గతంలో మంత్రి లోకేష్‌ను అవమానించారని... గో బ్యాక్ ఎంపీటీసీ అంటూ నినాదాలు చేశారు. దీంతో ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. టీడీపీ శ్రేణులు రెచ్చగొట్టే మాటలు మాట్లాడినా వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు సంయమనం పాటించారు. ఎంపీటీసీలు, అధికారులు కార్యాలయం లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించినా టీడీపీ నాయకులు అడ్డుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీఐ రాజారమేష్, ఎస్‌ఐ గాయత్రి సిబ్బందితో వచ్చి ఇరు వర్గాలను అడ్డుకున్నారు. శాంతి భద్రతల దృష్ట్యా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల్ మీట్ వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీఓ పోలప్ప ప్రకటించారు. అనంతరం ఇరు పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. మండల సమావేశం అధికారులు వాయిదా వేయడంతో వైఎస్సార్‌సీపీ ఎంపీపీ సాయిలీల, జడ్పీటీసీ మోహన్‌రెడ్డి, మండల కన్వీనర్ మాధవరెడ్డి అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. అనంతరం వారు ఎంపీటీసీలు, సర్పంచులతో కలిసి కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల మీట్ నిర్వహించడానికి కోరం ఉన్నా.. జరగపకుండా అధికార పార్టీ నాయకుల ఒత్తిడితో నిలిపివేయడం సరికాదన్నారు. ఈ విషయంపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

అనుమతి లేని లే అవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేయవద్దు

- చిప్పిలి డెయిరీ పక్కన హెచ్చరిక బ్యానర్ ఏర్పాటు
- అధికారులు వెళ్లిన వెంటనే తొలగించిన రియల్టర్లు
- నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకుంటాం
- పీకేఎం–ఉడా వైస్ చైర్మన్ బాబర్



లే అవుట్ వద్ద హెచ్చరిక బ్యానర్ ఏర్పాటుచేస్తున్న పీకేఎం–ఉడా, రెవెన్యూ అధికారులు

మదనపల్లె : ప్రభుత్వ అనుమతి లేని లే అవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసి ఇబ్బందులు కొని తెచ్చుకోవద్దని పలమనేరు, కుప్పం, మదనపల్లె అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(పీకేఎం–ఉడా) వైస్ చైర్మన్ బాబర్ తెలిపారు. పీకేఎం–ఉడా అనుమతులు లేకుండా చిప్పిలి అమూల్ డెయిరీకి ఆనుకుని బెంగళూరుకు చెందిన కొందరు వ్యక్తులు మంగళవారం లేఅవుట్ వేస్తున్నారన్న సమాచారం మేరకు ఆయన క్షేత్ర స్థాయిలో తనిఖీ చేశారు. వెంచర్ యజమాని ప్రభుత్వం నుంచి అనుమతులు లేకుండానే లే అవుట్‌ను అభివృద్ధి చేయడం గమనించారు. ల్యాండ్ కన్వర్షన్ లేకపోవడం, పీకేఎం–ఉడాకు దరఖాస్తు చేసుకోకుండానే పనులు ప్రారంభించడంపై రియల్టర్లను ఆయన ప్రశ్నించారు. తాము ఇంకా లే అవుట్‌ను సిద్ధం చేస్తున్నామని, పనులు పూర్తయ్యాక అనుమతులు తీసుకుంటామని చెప్పారు. వెంచర్‌కు సంబంధించిన బోర్డు వద్ద లే అవుట్‌కు అనుమతులు లేవని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసేందుకు వెళితే... ఐదు నిమిషాలు ఆగండి సార్...మీకు వేరే వాళ్లు ఫోన్ చేస్తారు. తర్వాత బోర్డు ఏర్పాటు చేసుకోండంటూ చెప్పారు. అనుమతులు తీసుకునేంత వరకు బ్యానర్ తొలగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రియల్టర్లకు సూచించారు. పీకేఎం–ఉడా వైస్ చైర్మన్ లేఅవుట్ స్థలం నుంచి వెళ్లిన కొద్దిసేపటికే రియల్టర్లు హెచ్చరిక బోర్డు చించేశారు. అధికారులు తమను ఏమీ చేసుకోలేరని, అధికార పార్టీ మంత్రి, నాయకుల అండదండలతోనే తాము వెంచర్ వేస్తున్నామని విలేకరులకు తెలిపారు. బ్యానర్ చించేసిన విషయమై పీకేఎం–ఉడా వైస్ చైర్మన్ బాబర్ వివరణ కోరితే... రియల్టర్లకు నోటీసులు జారీచేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రెడ్డెప్ప, సెక్రటరీ హరి, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

మీ ఇంటివద్దనే ఉంటూ ఓల్డ్ రికార్డు చూసి న్యూ రికార్డ్స్ రాయటం స్త్రీ పురుష అభ్యర్థులు 12 మంది కావలెను. నెలకు జీతం 12,000/–. ఫోన్ : 70756 58208

ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ పురుషులు కావలెను. అర్హత: 10th–డిగ్రీ, శాలరీ : 20k–30k మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రమ్ హోం అవకాశం కలదు. 8121818692

CBSE School Rajampet needs Principal vice principal Hostel Incharges, Wardens KG Teachers. Free food accommadation. 9100190500

హౌస్ కీపింగ్ స్టాఫ్(జీ:19,400),సె.గార్డ్స్(జీ: 16,000,అన్నిమండలాల్లో)టెంపుల్ సె.గార్డ్ (జీ: 13,000),ITIటెక్నీషియన్స్(జీ:16,500) అన్ని రకాల ప్రభుత్వఔట్ సోర్సింగ్ ఉద్యోగాలకు: 8897909097.

ప్రొద్దుటూరులోని ప్రముఖ హైస్కూల్ నందు పనిచేయుటకు B.Ed., అర్హత ఉండి అనుభవం కలిగిన లేడీ ప్రైమరీ టీచర్స్ వెంటనే కావలెను. ఫోన్: 8519911452

VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు / పురుషులు, ఆయా, నర్సులు, వంటచేయువారు, RMP & డ్రైవర్స్ కావలెను. జీ: 15 వేలు–40 వేలు, ఫ్రీ రూమ్+భోజనం, HYD. ఫోన్: 6309020999

సాక్షి క్లాసిఫైడ్స్ కొరకు సంప్రదించండి
9705907418
9705944423
9010223797
9010072409

గమనిక

తేలు కుట్టి బాలుడు మృతి

– హేమంత్ కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ





నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, హేమంత్ (ఫైల్)

రాజంపేట : మండలంలోని చెయ్యేటి పరీవాహక గ్రామమైన తొగురుపేటలో తేలు కుట్టడంతో బాలుడు హేమంత్(10) మృతి చెందారు. మండలంలోని నరసయ్య, రామసుబ్బమ్మ దంపతుల ఒక్కగానొక్క కుమారుడు హేమంత్ చిన్నమ్మ ఇంట్లో ఉంటూ మన్నూరు(రాజంపేట టౌన్) ప్రియదర్శిని స్కూల్‌లో మూడో తరగతి చదువుతున్నారు. వరుస సెలవులు రావడంతో బాలుడి తల్లిదండ్రులు తమ స్వగ్రామానికి తీసుకెళ్లారు. ఇంట్లో మూటలు సర్దుతున్న క్రమంలో హేమంత్ అక్కడ ఉన్న తేలును తొక్కడంతో కాటు వేసింది. వెంటనే ఏరియా ఆస్పత్రికి తరలించగా అక్కడి వైద్యులు కడప రిమ్స్‌కు తీసుకెళ్లాలని సూచించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. దీంతో తొగురుపేటలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఆకేపాటి పరామర్శ

తేలు కాటుకు గురైన హేమంత్ కుటుంబాన్ని రాజంపేట ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి పరామర్శించారు. ఒక్కగానొక్క కొడుకును పోగొట్టుకున్న తల్లిదండ్రులను ఓదార్చారు. బాలుడి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సంఘటనను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సాయం అందేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అరిగెల సౌమిత్రి, గుండుమల్లి, పల్లె గ్రీష్మంత్‌రెడ్డి, మధురాజు, నందలూరు ఉపసర్పంచి ఇబ్బు తదితరులు పాల్గొన్నారు.

నడిరోడ్డులో జన సైనికుల పోట్లాట



ఫిర్యాదు ఇచ్చిన అమర్ తదితరులు

రైల్వేకోడూరు అర్బన్ : అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు జనసేనలో విబేధాలు కొనసాగుతున్నాయి. రైల్వేకోడూరు నియోజకర్గంలో జనసేన కొట్లాట.. టీడీపీకి ఆటగా మారింది. రెండు పార్టీల్లో జన సైనికులు ఉన్నారు. కానీ వర్గ విభేదాలు జనసేన పార్టీలో నాయకత్వ లోపాన్ని కొట్టి చూపుతున్నాయి. అధినేత పవన్ కళ్యాణ్ వచ్చినప్పటికీ విబేధాలు పరిష్కారం కాలేదు. మంగళవారం పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో ఇరు వర్గాలు ఇంద్రా బస్‌షెల్టర్‌ను ఆధునికీకరించే విషయంలో ఘర్షణ పడ్డారు. స్థానిక మురుగన్ స్వీట్స్ వద్ద అమర్‌నాథ్, మరికొంత మందితో కలిసి మైసూరావారిపల్లికి చెందిన పగడాల వెంకటేష్, చంద్రశేఖర్‌లు దాడి చేశారు. పిడిగుద్దులు గుద్ది చొక్కాలు చించారు. గాయపడిన అమర్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందారు. జనసేనలో వర్గ విభేదాలు ముందుగా తెలిసినా మిన్నకుండి పోవడంతో ఆంతర్యమేమిటని పలువురు చర్చించుకొంటున్నారు. ఈసంఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ముత్యాల కిషోర్, నాగోలు అమర్‌నాద్,షేక్‌అబ్దుల్, వీరు తదితరులు పోలీసులకు ఫిర్యాదు ఇచ్చారు.

సబ్ కలెక్టరేట్‌లో సీఐడీ విచారణ

మదనపల్లె : సబ్ కలెక్టరేట్‌లో ఫైళ్ల దగ్ధం ఘటనకు సంబంధించి సీఐడీ రెండో రోజునా దర్యాప్తు చేసింది. సోమవారం రాత్రి సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్ మదనపల్లె సబ్ కలెక్టరేట్‌లో ఘటన జరిగిన ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్‌టీం ఆధారాలు సేకరించాయి. ప్రత్యక్షసాక్షులైన వీఆర్ఏ రమణయ్య, సీనియర్ అసిస్టెంట్ గౌతమ్‌తేజ్, ఆర్డీఓ హరిప్రసాద్‌తో సీన్ రీ కన్‌స్ట్రక్షన్ చేయించినట్లు తెలిసింది. మంగళవారం వేకువజాము వరకు సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు సబ్ కలెక్టరేట్‌లో విచారణలో పాల్గొన్నారు. తర్వాత సీఐడీ డీఎస్పీ వేణుగోపాల్, ఎస్‌ఐ వెంకటరమణలు ఘటన జరిగిన తర్వాత సిబ్బంది నుంచి పోలీసులు నమోదు చేసిన వాంగ్మూలాలపై క్రాస్ చెక్ చేశారు. కేసు పురోగతిపై రెండురోజుల్లో కీలక ప్రకటన చేసే అవకాశం ఉంటుందని సమాచారం. సీఐడీ అధికారులు రావడంతో మరోసారి సబ్ కలెక్టరేట్‌లో అలజడి నెలకొంది.

దాసిరిపల్లి జయచంద్రారెడ్డిని తప్పించండి

– రాష్ట్ర అధ్యక్షుడికి టీడీపీ నేతల ఫిర్యాదు



పార్టీ అధ్యక్షునికి ఫిర్యాదు చేస్తున్న తంబళ్లపల్లె టీడీపీ నేతలు

బి.కొత్తకోట : తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసిరిపల్లి జయచంద్రారెడ్డిని నాయకత్వ బాధ్యతల నుంచి తప్పించాలని నియోజకవర్గ టీడీపీ నేతలు డిమాండ్ చేశారు. విజయవాడలోని మంగళగిరి పార్టీ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును మంగళవారం కలిసి వినతిపత్రం అందించారు. ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిగా ప్రకటించినప్పటి నుంచి నాయకులు, కార్యకర్తలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వారు వివరించారు. జయచంద్రారెడ్డిని తప్పించకపోతే పార్టీ శ్రేణులు పార్టీలో ఇమిడే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. ఫిర్యాదుపై స్పందించిన పల్లా శ్రీనివాసరావు విషయాన్ని చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. జయచంద్రారెడ్డిపై తాజా ఫిర్యాదుతో టీడీపీ రాజకీయాలు వెడెక్కాయి. నియోజకవర్గానికి చెందిన సీనియర్, ముఖ్య నేతలు కలిసి వ్యతిరేకంగా ఏకమవడం చర్చనీయాంశమైంది. ఫిర్యాదు చేసిన వారిలో టీడీపీ నాయకులు డి.నారాయణస్వామిరెడ్డి, ఆనందరెడ్డి, పాలగిరి సిద్ధా, బిల్డర్ రమణ, సురేంద్రయాదవ్, పి.శ్రీనాథరెడ్డి, వైజీ. రమణ, భూమిరెడ్డి, ఎల్లారెడ్డి, ఈశ్వరప్ప, కుడుం శ్రీనివాసులు, కనకంటి ప్రసాద్, బంగారు వెంకటరమణ, సుకుమార్, తదితరులు ఉన్నారు.